ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 25.0 | కనిష్ఠం : 22.0

5



మహబూబ్‌నగర్

జిల్లా వార్తలు

శనివారం 1 నవంబరు 2025

వీరు మారరా?

- పాఠశాలల్లో పెరుగుతున్న కీచక ఉపాధ్యాయులు
- పలువురు గురువుల పనితీరుపై విమర్శల వెల్లువ
- లైంగిక వేధింపులకు పాల్పడ్డ టీచర్‌కు అదే పాఠశాలలో మళ్లీ పోస్టింగు

7

ఆర్‌ఎంపీల కమీషన్ దందా

- సర్జరీ కేసుకు 50 శాతం వరకు.. ● మిగతా వాటికి 20 నుంచి 40 శాతం..
- కేసులను రెఫర్ చేసినందుకు ఇస్తున్న ప్రైవేటు ఆసుపత్రులు
- సూపర్ స్పెషాలిటీ దవాఖానాల్లోనే అత్యధికం ● పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ

పాలమూరులో ఆర్‌ఎంపీల కమీషన్ దందా నడుస్తోంది. వారు రెఫర్ చేసిన కేసులకు ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఇస్తున్న కమీషన్లు చూస్తే ముక్కున వేలు వేసుకోవాల్సిందే. సర్జరీ కేసుకు 40 నుంచి 50 శాతం వరకు కమీషన్ ఇస్తున్నారని తెలుస్తోంది. సూపర్ స్పెషాలిటీ సేవలున్న ఆసుపత్రుల్లోనే ఈ దందా అధికంగా కొనసాగుతోంది. పెద్ద చదువులు చదివిన డాక్టర్లే ఈ దందాను పెంచి పోషిస్తున్నారు. వీటిపై దృష్టి సారించాల్సిన వైద్యాధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వస్తున్నాయి.

- మహబూబ్‌నగర్ వైద్యవిభాగం, (ఆంధ్రజ్యోతి)





సర్జరీకి 50 శాతం కమీషన్..

ఉమ్మడి జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా మహబూబ్‌నగర్‌లో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను ఏర్పాటు చేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని ఆర్‌ఎంపీల ద్వారా రెఫర్ అవుతున్న సర్జరీ కేసులకు 50 శాతం కమిషన్ ఇస్తున్నారని సమాచారం. ఉదాహరణకు ఓ సర్జరీ కేసుకు రూ.50 వేల బిల్లు అయితే అందులో రూ.25 వేలు ఆర్‌ఎంపీలకు కమీషన్ రూపంలో ఇస్తున్నారు. మిగతా కేసులకు 20 శాతం నుంచి 40 శాతం వరకు కమీషన్ ఇస్తున్నారని తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఆర్ ఎంపీలు కేసులను ప్రైవేటు ఆస్పత్రులకు రెఫర్ చేసి, కమీషన్లు తీసుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో దాదాపు 6 వేల నుంచి 7 వేల వరకు ఆర్‌ఎంపీలు ఉన్నట్లు తెలుస్తోంది. ఏ చిన్నరోగం వచ్చిన గ్రామీణులు ముందుగా గ్రామంలోని ఆర్‌ఎంపీ వద్దకే వెళ్తారు. దీన్ని ఆసరాగా చేసుకొని వారు రోగిని భయాందోళనలకు గురిచేసి మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాల నుంచి కేసులు ఇక్కడికి వస్తున్నాయి. ఇలా రెఫర్ చేసిన కేసులకు ఆయా ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు కేసుకు ఇంత అని కమీషన్ ఇస్తూ దందాకు తెర లేపారు. గతంలో ఈ సంస్కృతి కొన్ని ఆసుపత్రులకు మాత్రమే ఉండేది. ప్రస్తుతం ప్రతీ ఆసుపత్రి ఆర్‌ఎంపీ రెఫరల్ కేసుల ద్వారా కొనసాగుతుండటం గమనార్హం. ఆర్‌ఎంపీలు పంపించే కేసులకు ప్రత్యేకంగా రిజిష్టర్‌ను కూడా పెట్టి సంతకాలు తీసుకొని మరీ కమిషన్ ఇస్తున్నారని తెలుస్తోంది.

ప్రైవేటు ఆసుపత్రుల విచ్చలవిడి వ్యాపారం..

ఉమ్మడి జిల్లాలోని నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల నుంచి మహబూబ్‌నగర్‌కు అధిక కేసులు వస్తున్నాయి. అందుకు గాను ఆయా జిల్లాలోని ఆర్‌ఎంపీలు నెలకు లక్షల రూపాయలు కమీషన్ రూపంలో తీసుకుంటున్నారని తెలుస్తోంది. ఈ వ్యవహారాలన్నింటినీ నడిపించేది డాక్టర్లే. ప్రతీ నెల ఎక్కువ ఓపీ వస్తున్న ఆర్‌ఎంపీలను ఎంపిక చేసుకొని ఆయా ఆసుపత్రుల పీఆర్వోల ద్వారా వారిని సంప్రదిస్తున్నారు. వారి ద్వారా ఆర్‌ఎంపీలను

(మిగతా 6లో..)



రోగులతో కిటకిటలాడుతున్న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రి

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లోనే..

జిల్లా కేంద్రంలోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో (యూరాలజీ, న్యూరాలజీ, కార్డియాలజీ) దాదాపు 50 శాతం వరకు కమీషన్ ఇస్తున్నారని సమాచారం. ఇటీవల 10 మంది పార్ట్‌నర్‌లతో శెట్టి కాంప్లెక్స్ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఓ ఆసుపత్రిలో ఒక్కో కేసుకు ఆర్‌ఎంపీలకు 50 శాతం వరకు కమిషన్ ఇస్తున్నారని తెలిసింది. అదేవిధంగా ఫ్రాంచైజ్ ఆసుపత్రులు 30 నుంచి 40 శాతం ఇస్తుండగా, మరికొన్ని ఆసుపత్రులు 10 నుంచి 20 శాతం మాత్రమే ఇస్తున్నాయని సమాచారం.

తనిఖీలు నిర్వహిస్తాం..



ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు, ఆర్ ఎంపీలతో సమావేశాలు ఏర్పాటు చేయిస్తాం. వారితో మాట్లాడి ఆర్‌ఎంపీ రెఫరల్స్, కమీషన్ల వ్యవహారంపై చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రులు తనిఖీ చేసి ఇలాంటివి ఏవైనా ఉంటే సంబంధిత ఆసుపత్రులపై చర్యలు తీసుకుంటాం.

- డాక్టర్ కృష్ణ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, మహబూబ్‌నగర్



అన్నారెడ్డిపల్లి వాగు సమీపంలో డంప్ చేసిన ఇసుక

పగలు తోడివేత.. రాత్రి తరలింపు

- గండీడ్ ఉమ్మడి మండల వ్యాప్తంగా జోరుగా ఇసుక అక్రమ రవాణా
- ట్రాక్టర్‌కు రూ.5,000.. టిప్పర్‌కు రూ.35 వేలు
- అడిగితే బెదిరింపులు..
- మామూళ్ల మత్తులో అధికారులు

మహమ్మదాబాద్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గండీడ్ మండల వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా యధేచ్ఛగా సాగుతోంది. మహమ్మదాబాద్ మండల పరిధిలోని దర్మాపూర్, అన్నారెడ్డిపల్లి, గండీడ్ మండల పరిధిలోని పగిడ్యాల్, రంగారెడ్డిపల్లి, సల్కర్‌పేట, లింగాయపల్లి వాగుల నుంచి ఇసుకను తరలిస్తున్నారు. వర్షాలు కురిసి వాగులు పారుతుండటంతో ప్రభుత్వం ఇసుకు అమ్మకాలను నిలిపేసింది. ఇదే అదునుగా ఉమ్మడి మండలంతో పాటు పక్కనే ఉన్న వికారాబాద్ మండల పరిధిలోని పలు గ్రామాలకు ఇసుకను సరఫరా చేసి, కాసులు కూడబెట్టుకుంటున్నారు. చీకటి పడిందంటే దళారులు పలు గ్రామాల్లోని వాగులపై గద్దల్లా వాలుతున్నారు. జేసీబీల ద్వారా ఇసుకను తోడేసి, ట్రాక్టర్‌కు రూ.4,500 నుంచి రూ.5,000 వరకు అమ్ముతున్నారు. టిప్పర్ అయితే రూ.25 వేల నుంచి రూ.35 వేల వరకు తీసుకుంటున్నారు. మహమ్మదాబాద్ మండల పరిధిలోని అన్నారెడ్డిపల్లి వాగు నుంచి ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. గండీడ్ పరిధిలోని రంగారెడ్డిపల్లి వాగులో నీరు పారుతున్నా ఎక్స్‌కవేటర్ల ద్వారా పట్టపగలు తోడేస్తున్నారు. తర్వాత రాత్రి వేళ ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. అడిగితే బెదిరింపులకు దిగుతున్నారు. అధికారులకు మామూళ్లు ఇస్తున్నామని దబాయిస్తున్నారు.



కంచిపల్లి రెవెన్యూ శివారులో ఏర్పాటు చేసిన ఫిల్టర్ ఇసుక తయారీ స్థావరం

దండిగా ఫిల్టర్ ఇసుక స్థావరాలు

మహమ్మదాబాద్ మండల పరిధిలోని ధర్మాపూర్, వెంకటరెడ్డిపల్లి మధ్యలో, బాపన్‌కుంట సమీపంలో ఫిల్టర్ ఇసుక స్థావరాలు ఏర్పాటు చేశారు. ఎక్స్‌కవేటర్లతో మట్టితవ్వి ఫిల్టర్ ఇసుక తయారు చేస్తున్నారు. అందుకోసం వందలాది టిప్పర్ల మట్టిని డంప్ చేశారు. కంచిపల్లిపల్లి, మహమ్మదాబాద్, అన్నారెడ్డిపల్లి పరిధిలోనూ ఫిల్టర్ ఇసుక స్థావరాలు ఉన్నాయి.

నాయకుల అండ దండలతోనే

పలు పార్టీల నాయకుల అండదండలతోనే అక్రమార్కులు అనుమతులు లేకుండా ఇసుక తరలించి సొమ్ము చేసుకుంటున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అధికారుల తనిఖీలు చేస్తే వారిపై ఒత్తిళ్లు తేడంతో ఇరు మండలాల రెవెన్యూ, పోలీసు అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

దేశ సమైక్యత కోసం పోరాడిన మహనీయుడు పటేల్



2కే రన్‌లో పాల్గొన్న ఎంపీ అరుణ, కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి

- పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ
- పాలమూరులో రన్ ఫర్ యూనిటీ 2కే రన్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, విద్యావిభాగం, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): దేశ సమైక్యత కోసం మొక్కవోణి దీక్షతో పోరాడిన మహనీయుడు సర్దార్ వల్లభాయ్ పటేల్ అని మహబూబ్‌నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ అన్నారు. పటేల్ 150వ జయంతి(జాతీయ సమైక్యతా దినోత్సవ) వేడుకల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ 2కే రన్ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కలెక్టర్ విజయేందిరబోయి, ఎస్పీ డీ జానకిలతో కలిసి జిల్లా స్టేడియం మైదానంలో రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా అరుణ మాట్లాడుతూ ఏక్ భారత్-ఆత్మనిర్భర్ భారత్ సాధనే మనందరి లక్ష్యమని, అప్పుడే సర్దార్ పటేల్ ఆశయాలు సాధించినట్లు అవుతుందని అన్నారు. కలెక్టర్ విజయేందిరబోయి మాట్లాడుతూ పటేల్ కృషి ఫలితంగానే దేశం సమైక్యంగా ఉందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. డప్పు కళాకారుల ఆట పాటలు ఆకర్షణగా నిలిచాయి. స్టేడియం మైదానం నుంచి అంబేడ్కర్ చౌరస్తా, అశోక్‌టాకిస్ చౌరస్తా, పాత బస్టాండ్ మీదుగా క్లాక్‌టవర్ వరకు రన్ కొనసాగింది. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, జడ్పీ సీఈఓ వెంకటరెడ్డి, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు పద్మాజరెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

పోలీసుల ఆధ్వర్యంలో..

మహబూబ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): దేశ సమగ్రత, ఏకతా కోసం సర్దార్ వల్లభాయ్ పటేల్ చేసిన కృషి అభినందనీయమని జోగులాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్ అన్నారు. పటేల్ జయంతిని పురస్కరించుకుని ఎస్పీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎస్పీ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కార్యాలయం నుంచి రన్ ఫర్ యూనిటీ 2కే రన్ కార్యక్రమాన్ని డీఐజీ ప్రారంభించారు. రన్‌లో పాల్గొని మొదటి మూడు స్థానాల్లో నిలిచిన సీనియర్ అధికారులకు, కానిస్టేబుళ్లకు, హోంగార్డులకు ఎస్పీ ప్రశంసాపత్రాలు అందించారు. అదనపు ఎస్పీ ఎన్‌బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేశ్‌కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.



2కే రన్ ప్రారంభిస్తున్న జోగులాంబ జోన్ డీఐజీ ఎల్‌ఎస్ చౌహాన్

దరఖాస్తు గడువు పొడగింపు

- పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు డిసెంబరు 31 చివరి గడువు
- జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శంకరాచారి

మహబూబ్‌నగర్ అర్బన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ షెడ్యూల్డ్ కాస్ట్ డెవలప్‌మెంట్ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన ఉత్తర్వుల మేరకు 2025-26 విద్యా సంవత్సరం కోసం పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ ఆన్‌లైన్ దరఖాస్తు తేదీని డిసెంబర్ 31 వరకు పొడిగించినట్లు జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి శంకరాచారి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని కళాశాలలు, విశ్వవిద్యాలయాల నిర్వాహకులు, విద్యార్థులు ఈ-పాస్ వెబ్‌సైట్ హెచ్ టీటీపీ:తెలంగాణ ఈపాస్.సీజీజీ. జీవోవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా స్కాలర్‌షిప్ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఇంకా కౌన్సెలింగ్ పూర్తికాని విద్యార్థులు తక్షణమే తమ వివరాలను ఈ-పాస్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

యువతకు అవకాశాలు కాంగ్రెస్ ధ్యేయం

- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం
- మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షుడిగా గోనెల శ్రీనివాస్ నియామకం

పాలమూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పార్టీ కోసం కష్టపడి పని చేసిన ప్రతీ ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ సముచిత గౌరవం ఇస్తుందని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు(పర్సన్ ఇన్‌చార్జి)గా గోనెల శ్రీనివాస్‌ను నియమిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సీనియర్ నాయకులు, యువతను ప్రోత్సహించాలనే దృక్పథంతో గోనెల శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించామని తెలిపారు. నిజాయితీతో చిత్తశుద్ధితో పనిచేసే నాయకుడు గోనెల శ్రీనివాస్ అని ఎమ్మెల్యే ప్రశంసించారు. మత్స్యకారుల సంక్షేమం కోసం, అర్హులైన వారికి ప్రభుత్వ పథకాలు చేరేలా చురుకుగా పని చేయాలని చెప్పారు. చెరువులపై ఆధారపడిన మత్స్యకారుల ఆదాయాభివృద్ధి, మార్కెట్ విస్తరణ, ఉపాధి సృష్టిలో సంఘం కీలకపాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. గ్రామాల వరకు సంక్షేమ పథకాలు సక్రమంగా అమలు చేయడంలో నాయకులు, సంఘం ప్రతినిధులు ముందు వరుసలో ఉండాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రి, వేముల కృష్ణయ్య, హన్వాడ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వి.మహేందర్, మైత్రియాదయ్య, శరత్, యం.ప్రవీణ్‌కుమార్, రామకృష్ణ, స్వరూప పాల్గొన్నారు.

పీఆర్‌సీ అమలు చేయాలి

- పీఆర్‌టీయూ నారాయణపేట కమిటీ

నారాయణపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని పీఆర్‌టీయూ నారాయణపేట జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. శుక్రవారం నారాయణపేటలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సంఘం జిల్లా సర్వసభ్య సమావేశాన్ని జిల్లా అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో 51 శాతం ఫిట్‌మెంట్‌తో పీఆర్‌సీని తక్షణమే అమలు చేయాలని, విద్యారంగ సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని రాష్ట్ర శాఖను కోరుతూ తీర్మానం చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు టెట్ గురించి ఆందోళన చెందొద్దని, 2010 కంటే ముందు నియామకమైన ఉపాధ్యాయులకు మినహాయింపు వచ్చేలా కేంద్ర ప్రభుత్వం విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 23లో మార్పు చేసేలా సంఘం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షుడు తిరుపతి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు జనార్ధన్

రేపు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

- 7 నుంచి 9వ తేదీ వరకు రాష్ట్రస్థాయి సీనియర్ మహిళల టోర్నీ

7



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్

నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 125.00
హోల్ సేల్	: 134.00
డ్రెస్డ్	: 223.00
స్కిన్ లెస్	: 243.00

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచాలి



ఊట్కూర్ సీపీఎస్‌లో రెండో తరగతి విద్యార్థినితో పిక్చర్ రీడింగ్ చేయిస్తున్న కలెక్టర్

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్

ఊట్కూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల విద్య సామర్థ్యాలను పెంచేలా ఉపాధ్యాయులు పని చేయాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ చెప్పారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, తిప్రాస్‌పల్లి మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఊట్కూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలు పెంచడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని హెచ్‌ఎంను అడిగారు. నాల్గో తరగతి గదిలోకి వెళ్లి గణితం ప్రశ్నలు అడిగారు. అడిగిన లెక్కలు విద్యార్థులు బోర్డుపై చేయడంతో అభినందించారు. రెండో తరగతి గదిలో ఆంగ్ల నైపుణ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులతో ఆంగ్ల పదాలను చదివించారు. రికార్డులను తనిఖీ చేసి, విద్యార్థుల గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం తిప్రాస్‌పల్లి విజయ్ కాటన్ ఇండస్ట్రీలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. రైతులతో మాట్లాడారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్, సీఎంఓ రాజేందర్‌కుమార్, తహసీల్దార్ చింత రవి, ఎంఈఓ కే.మాధవి, ఏఓ గణేష్‌రెడ్డి, కాంప్లెక్స్ హెచ్‌ఎం కుసుమ పాల్గొన్నారు.



పోలీసుల అదుపులో

గంజాయి విక్రేతలు?

జడ్చర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జడ్చర్ల పట్టణ శివారులో గంజాయి విక్రయిస్తున్న వారిని పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి 200 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించి విశ్వసనీయంగా తెలిసిన సమాచారం మేరకు.. జడ్చర్ల నుంచి గంగాపురం వెళ్లే దారిలోని ఓ వెంచర్ వద్ద ఓ వ్యక్తి మరో వ్యక్తి గంజాయి విక్రయిస్తుండగా పోలీసులు శుక్రవారం దాడి చేసి పట్టుకున్నారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా పోరాడాలి

» ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న


పాలమూరు యూనివర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతున్న తీన్మార్ మల్లన్న

పాలమూరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): బీసీలు రాజ్యాధికారం దిశగా తమ హక్కులను సాధించుకునేలా పోరాడాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపకుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లాలోని పలుచోట్ల పర్యటించి పాలమూరు యూనివర్సిటీలో భోజన విరామంలో విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధిలేదన్నారు. తమిళనాడు తరహాలో రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్‌లో పెడితే తప్ప చట్టబద్ధత ఉండదని మొదటి నుంచి చెబుతూనే ఉన్నాయన్నారు. ఈ విషయంలో అన్ని పార్టీలు బీసీలను మోసం చేశాయన్నారు. కార్యక్రమంలో టీఆర్‌పీ, బీసీ సమాజ్ నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజలు ఎవరూ భయపడొద్దు

» మార్లపాడు తండాలో పర్యటించిన అదనపు కలెక్టర్లు


గ్రామస్థులతో మాట్లాడుతున్న అధికారులు

అచ్చంపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఎవరు కూడా భయపడవద్దని అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం భరోసా ఇచ్చారు. నక్కలగండి ముంపు గ్రామమైన మార్లపాడు తండాను శుక్రవారం వారు పరిశీలించారు. నీటి ముంపు వలన గ్రామంలో నెలకొన్న సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షాలతో అచ్చంపేట మండలంలోని నక్కలడండి తండా మొత్తం జలమయం అయింది. తండాలో మొత్తం 350 కుటుంబాలు 638 మంది జనాభా ఉన్నారు. వీరిని సురక్షితంగా గ్రామ సమీపంలోని సిద్ధాపూర్ ప్రభుత్వ పాఠశాలలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసి వారికి వసతులు కల్పిస్తున్నారు. ఇప్పటికీ గ్రామంలో బురద నీరు ఉండడంతో గ్రామంలో అధికారులు తిరుగి పరిశీలించారు. పంట నష్టంతో పాటు ఇళ్ల నష్టాల వివరాలను అధికారులు సేకరించారు. పూర్తి స్థాయి నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి అందజేస్తామని వారు తెలిపారు. పునరావాస కేంద్రంలో ఉన్న ప్రజలకు కావాల్సిన అవసరాలను కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీరాములు, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులున్నారు.

ఈకేవైసీకి కోసం కూలీల అవస్థలు

» నెట్‌వర్క్ లేక ఊరికి 10 కి.మీ. దూరం వెళ్తున్న అధికారులు


అడవిలో సిగ్నల్స్ ఉన్న ప్రాంతంలో ఉపాధికూలీలు, అధికారులు

పదర, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కూలీలు ఈకేవైసీ చేయించుకోవడానికి నెట్‌వర్క్ సౌకర్యం లేక నానా తంటాలు పడుతున్నారు. తప్పక ఈకేవైసీ చేయించాలన్న పై స్థాయి అధికారుల ఆదేశాల మేరకు క్షేత్రస్థాయి అధికారులు కూలీల చేత ఆన్‌లైన్‌లో ఈకేవైసీ చేయించడానికి నెట్‌వర్క్ కలవక, అనేక ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం మండలంలోని మద్దిమడుగు గ్రామంలో ఉపాధి కార్డులున్న వారందరికీ ఈకేవైసీ చేయించడానికి అధికారులు ఆ గ్రామానికి వెళ్లారు. కానీ, అక్కడ నెట్‌వర్క్ లేకపోవడంతో సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఫారెస్టు చెక్ టపోస్టు ప్రాంతానికి వెళ్లాల్సి వచ్చింది. ఇదిలా ఉండగా ఇటీవలే మద్దిమడుగు గ్రామంలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ ఎయిర్‌టెల్ టవర్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటయ్య, ఏపీవో గోపి, ఈసీ, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

వేరుశనగ పంట మొలక శాతం పెరుగుదలపై పరిశీలన


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు, శాస్త్రవేత్తలు

లింగాల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాడాపూర్, మక్దంపూర్ గ్రామాల శివారులో రైతులు సాగు చేస్తున్న వేరుశనగ పంటలను పాలెం వ్యవసాయ పరిశోధనా కేంద్ర శాస్త్రవేత్తలు, అచ్చంపేట ఏడీఏ చంద్రశేఖర్‌లతో కలిసి శుక్రవారం పరిశీలించినట్లు మండల వ్యవసాయ అధికారి గుండురు అనిల్ తెలిపారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్ (ఎన్‌ఎంఈవో)లో భాగంగా ఆయిల్ సీడ్స్ పథకం ద్వారా (వీసీసీ-పీఏసీఎస్ అంబటిపల్లి) ద్వారా రైతులకు పంపిణీ చేసిన జీజేజీ-32రకం వేరుశనగ, విత్తనాల మొలక శాతం, పంట పెరుగుదల, పంట స్థితి వంటి అంశాలను పరిశీలించి రైతుల నుండి వివరాలను సేకరించినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సూరాపూర్ ఏఈవో భరత్‌కుమార్ పాల్గొన్నారు.

జీవాల కాపరిపై కర్ర, రాయితో దాడి

» కాపరి మృతి

విజయపురిసౌత్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జీవాల కాపరిపై కర్ర, రాయితో దాడి చేయగా అతను మృతిచెందిన సంఘటన పల్నాడు జిల్లా చింతలతండాలో శుక్రవారం చోటుచేసుకుంది. మహబూబ్‌నగర్ జిల్లా చింతకుంట్ల మండలం లాలా కోట్లపల్లికి చెందిన జగ్గప్పల సాయి (26) జీవాలను మేపుకునేందుకు చింతలతండా గ్రామానికి వచ్చాడు. కొద్ది రోజులుగా గ్రామంలోనే ఉంటూ జీవాలను మేపుకుంటున్నాడు. కాగా శుక్రవారం జీవాలు మేపుకునేందుకు వెళ్లగా గ్రామంలోని బుడ్డానాయక్ పొలంలో జీవాలు మేశాయి. ఇది గమనించిన బుడ్డానాయక్ దీనిపై సాయిని నిలదీశాడు. ఈ విషయంలో వీరిద్దరి మధ్య మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. కోపోద్రిక్తుడైన బుడ్డానాయక్ రాయి, కర్రతో సాయిపై దాడి చేశాడు. తీవ్ర గాయాలతో సాయి అక్కడికక్కడే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. సాయి మృతదేహాన్ని నాగార్జున సాగర్ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సమర్థవంతంగా మాస్టర్ ప్లాన్

» కలెక్టర్ విజయేందిర బోయి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అమృత్ 2.0 పథకం కింద జీఐఎస్ ఆధారిత మాస్టర్ ప్లాన్ రూపకల్పన సమర్థవంతంగా చేపట్టాలని, అవసరమైన వివరాలను సంబంధిత శాఖల అధికారులు అందించాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డీటీసీపీ సంయుక్త సంచాలకులు, అమృత్ నోడల్ అధికారి అశ్విని, సంబంధిత శాఖల అధికారులకు, మునిసిపల్ కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులకు జడ్చర్ల మాస్టర్ ప్లాన్ రూపకల్పన అంశంపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా మొదటి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితిని అర్థం చేసుకోవడానికి, 20 ఏళ్ల వరకు భవిష్యత్ అవసరాలు అంచన వేయడానికి ప్రాదేశిక వివరాలను సేకరించాలని తెలిపారు. 2051 నాటికి జనాభా ప్రాతిపదికన ప్రజలకు అవసరమైన ఇళ్లు, తాగునీరు, రహదారులు, ఇతర సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా అందించేందుకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని తెలిపారు. జడ్చర్ల పట్టణ పరిధిలోని డ్రోన్, సోషియో ఎకనామిక్ సర్వే పూర్తి చేయడం జరిగిందని, ముసాయిదా మాస్టర్‌ప్లాన్ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, అదనపు ఎస్పీ రత్నం, జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత, కమిషనర్ లక్ష్మారెడ్డి, ముఖ్య ప్రణాళికాధికారి రవీందర్, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

ఐఐటీ మద్రాస్ నిర్వహిస్తున్న ప్రతిష్ఠాత్మక స్కూల్ కనెక్ట్ ప్రోగ్రాంలో జడ్చర్ల మండలంలోని కోడుగల్ జెడ్పీహెచ్‌ఎస్ చెందిన ఆరుగురు విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. పదో తరగతి విద్యార్థులు 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డేటా సైన్స్' కోర్సును 8వారాలపాటు ఆన్‌లైన్ ద్వారా పూర్తి చేశారు. పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఐఐటీ మద్రాస్ సర్టిఫికెట్లను మంజూరు చేయగా, శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ విజయేందిరబోయి అందజేశారు. డీఈవో ప్రవీణ్‌కుమార్, జడ్చర్ల ఎంఈవో మంజులాదేవి తదితరులు పాల్గొన్నారు.

చట్టానికి లోబడి పని చేయాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ఆసుపత్రులు, పరీక్ష కేంద్రాలు, స్కానింగ్ సెంటర్లు క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు - 2010కు లోబడి పని చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సమీకృత ప్రభుత్వ కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో శుక్రవారం ప్రైవేటు హాస్పిటల్ రిజిస్ట్రేషన్ జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. 2 ఆసుపత్రులు, 4 క్లినిక్‌లు, 2 డయోగ్నోస్టిక్ కేంద్రాల దరఖాస్తులను పరిశీలించారు. రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకున్న సృష్టి హాస్పిటల్, మహాలక్ష్మి, పాలీక్లినిక్‌లకు ఆమోదం తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేసేందుకు దరఖాస్తు చేసుకున్న రాజు పాలీ క్లినిక్, రమేశ్ పాలీక్లినిక్ లకు కమిటీ ఆమోదం తెలిపింది. శ్రీవాసవి ఆయుర్వేద క్లినిక్, శ్రీనివాస డయాగ్నోస్టిక్, ఓంకార్ డయాగ్నోస్టిక్, పల్స్ ఆసుపత్రికి సంబంధించిన బయోమెడికల్ వేస్టేజ్ ధృవీకరణ పత్రం గడువు సమీపిస్తున్నందున పెండింగ్‌లో పెట్టింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రుల రెన్యువల్‌కు సకాలంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసుపత్రులు, క్లినిక్‌లలో ధరల పట్టికను తప్పకుండా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి శ్రీనివాసులు, డీఎస్పీ ఉమామహేశ్వరరావు, ఇతర వైద్యులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలి

» ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగారుబాబు


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న విద్యార్థులు

నాగర్‌కర్నూల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల కోసం నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే చొరవ తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బంగారుబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడించి ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే అసవరమైన నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ భరత్, నాయకులు రమేష్, ప్రసాద్‌కుమార్, మల్లేష్‌యాదవ్, శివ, మహేష్, విష్ణు, వినయ్, భీమయ్య, చరణ్, డానియల్, జీవన్, కీర్తన, లావణ్య, స్వాతి, అబిత పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలి

అచ్చంపేటటౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం అచ్చంపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముందు ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో మంచి మార్పులు తీసుకొస్తామని, అధిక నిధులు కేటాయించి విద్యారంగ అభివృద్ధికి కృషి చేస్తామని అనేక హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కార్ విద్యారంగంపై సవతి ప్రేమ చూపిస్తోందన్నారు. గత సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 7 శాతం నిధులు కేటాయించిందని, వాటిని కూడా పూర్తిగా విడుదల చేయలేదని ఆరోపించారు. ప్రభుత్వం రూ. 8600 కోట్ల పెండింగ్‌లో పెట్టి పేద విద్యార్థులను విద్యను దూరం చేస్తున్నదని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అనిల్, మణిరంత, ఆనంద్, రాము, అర్జున్ సన్నీ, సాయి, శివ, భారత్, అజ య్, భాను, ప్రసాద్, మహేష్ ఉన్నారు.

స్వయం సహాయక సంఘాల బలోపేతానికి శిక్షణ


బల్గెరలో మహిళా సంఘాలకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

గట్టు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని బల్గెర గ్రామంలో స్వయం సహాయక మహిళా సంఘాల బలోపేతానికి తీసుకోవాల్సిన అంశాలపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఆర్పీ కవిత, వెంకటేశ్వరి శిక్షకులుగా వ్యవహరించారు. స్వయం సహాయక సంఘాల్లో ప్రతీ నెల పొదుపులు, అప్పులు, బ్యాంకు రుణాలు, శ్రీనిధి అప్పులు తీసుకుని ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు ఎలా నిర్వహించుకోవాలన్న అంశాలపై మహిళా సంఘాల సభ్యులకు క్లుప్తంగా వివరించారు. అదేవిధంగా స్వయం సహాయక సంఘాల్లో కట్టుబాట్లపై ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్న విషయాలను చర్చించారు. గ్రామ సంఘాలలో పాలకవర్గ సభ్యులు విధులు, బాధ్యతలపై వివరించారు. కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం దేవదాసు, గ్రామైక్య సంఘం అధ్యక్షురాలు శాంతికుమారి, సీసీ జ్యోతి, వీవోఏలు జయ్యన్న, రవిచంద్ర పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

- ఆర్డీవో జనార్దన్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జనార్దన్‌రెడ్డి

వెల్దండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్‌రెడ్డి అన్నారు. నాగర్‌క ర్నూల్ జిల్లా, వెల్దండ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాల యంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులలో వచ్చిన సమస్యలను పారదర్శకంగా పరి ష్కరించాలన్నారు. గ్రామపాలన అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఓటరు కార్డులకు సంబ ధించిన వివరాలను బీఎల్‌వోల యాప్‌లలో పకడ్బందీగా నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్తీక్‌కుమార్, ఆర్‌ఐ శంకర్‌నాయక్, సిబ్బంది గణేశ్, రమేశ్, మహేశ్, అవి నాష్ తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి జాతరలో భక్తుల సందడి


స్టాల్‌లో వంట పాత్రలు కొనుగోలు చేస్తున్న మహిళలు


కురుమూర్తి జాతరలో రంగుల రాట్నం వద్ద భక్తుల సందడి

చిన్నచింతకుట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపురం గ్రామ సమీపంలో వెలసిన కురుమూర్తి వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం జాతర మైదానంలో భక్తుల రద్దీ కనిపించింది. మైదానంలోని ప్రధానంగ రంగులరాట్నాలను ఆకట్టుకున్నాయి. చిన్న పిల్లలు, మహిళలు, యువకులు పెద్దఎత్తున రంగులరాట్నాల వద్ద సందడి చేశారు. జాతర ప్రాంగణంలోని వివిధ రకాల దుకాణాల వద్ద కొనుగోలుదారులతో కిటకిటలాడింది.

ఆర్‌ఎంపీల కమీషన్ దందా

(5వ పేజీ తరువాయి)

గుర్తించి అందరికీ రహస్యంగా ఓ చోట సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. కొంతమంది ఆర్‌ఎంపీలకు అడ్వాన్సులు ఇచ్చి మరీ రోగులను రెఫరల్స్ చేయించుకుంటున్నారు. మరికొంత మంది ఆర్‌ఎంపీలను విహార యాత్రలకు తీసుకెళ్తున్నారని సమాచారం. ప్రతీ నెల కమీషన్ డబ్బులు ఆయా ఆసుపత్రుల పీఆర్వోలు ఆర్‌ఎంపీలకు అందజేస్తున్నారు. దేవుడి స్థానంలో ఉన్న డాక్టర్లే రోగులతో వ్యాపారం చేస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు

కిమ్మనని వైద్య ఆరోగ్యశాఖ..

ప్రైవేటు ఆసుపత్రుల్లో కమీషన్ దందా జరుగుతున్నా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కిమ్మనడం లేదు. ప్రతీ నెల ప్రైవేటు ఆసుపత్రులను తనిఖీ చేసి నడుస్తున్న తీరు, రోగులకు అందిస్తున్న సేవలు, ఫీజుల వివరాలపై చర్యలు తీసుకోవాల్సి ఉండగా ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదు. ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు వైద్యాధికారులకు కూడా మామూళ్లు బాగానే ఇస్తున్నారనే ఆరోపణలు బాహటంగానే వినిపిస్తున్నాయి.

శ్రీలత మృతికి కారకులను కఠినంగా శిక్షించాలి

- మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

కోస్గి రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట జిల్లా, కోస్గి మండలంలోని చంద్రవంచ గ్రామానికి చెందిన గొల్ల శ్రీలత మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. గ్రామంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీలత మృతికి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి కారు డ్రైవర్ సూరి కారణమని ఆరోపించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ. 25 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు శ్రీలత మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, వెంకట్ నర్సింహ, పోశప్ప పాల్గొన్నారు.

చెరుకు ఫ్యాక్టరీ యాజమాన్యంతో చర్చలు సఫలం

అమరచింత, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): చెరుకు రైతుల సమస్యలపై కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యంతో జరిపిన చర్చలు సఫలమయ్యాయని తెలంగాణ చెరుకు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ గోపి పేర్కొన్నారు. శుక్రవారం అమరచింతలో ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ... చెరుకు ఫ్యాక్టరీకి చదివిన 14 రోజుల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయడానికి యాజమాన్యం ఒప్పుకున్నట్లు ఆయన తెలిపారు. చెరుకు టన్నుకు 3924 బోనస్‌తో కలిపి ఇవ్వడానికి ఒప్పుకున్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెరుకు రైతులకు బోనస్ 1000 రూపాయలు ఇస్తానని కాంగ్రెస్ ప్రభుత్వం పేర్కొన్న అది అమలు చేయడం లేదని ఆయన అన్నారు. చెరుకు రైతు సమస్యలపై తమ సంఘం ఆధ్వర్యంలో రైతుల పక్షాన పోరాడుతామని అన్నారు.

ఓటరు అనుసంధాన ప్రక్రియ పరిశీలన


ఓటరు అనుసంధానాన్ని పరిశీలిస్తున్న శిక్షణలో ఉన్న డిప్యూటీ కలెక్టర్లు

వెల్దండ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వెల్దండ మండలంలో కొనసాగుతున్న ఓటరు కార్డుల అనుసంధాన ప్రక్రియను శిక్షణలో ఉన్న డిప్యూటీ కలెక్టర్లు హర్షవర్ధన్, అశోక్ పరిశీలించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బూత్‌లెవల్ అధికారులు 2002 నుంచి 2025 వరకు ఓటర్ల వివరాలను ప్రత్యేక యాప్‌లో కుటుంబాల వారీగా నమోదు చేసే ప్రక్రియను పరిశీలించారు. ఈ విషయంపై వారు వ్యక్తం చేసిన అనుమానాలను తహసీల్దార్ కార్తీక్‌కుమార్ నివృత్తి చేశారు.

యువకుడి ఆత్మహత్య

జడ్చర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : జడ్చర్ల పట్టణంలోని లక్ష్మీవేంకటేశ్వరకాలనీలో శుక్రవారం తరుణ్(19) అనే యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా పూసపాటిరేగ, అల్లాడిపాలెంకుచెందిన తరుణ్, జడ్చర్ల మండలంలోని పోలేపల్లి సెజ్‌లోని అరబిందో ఫార్మా పరిశ్రమలో సూపర్‌వైజర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా లక్ష్మీ వేంకటేశ్వరకాలనీలో ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న తరుణ్, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇందుకు గల కారణాలు తెలియరాలేదు. కాగా ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని జడ్చర్ల పోలీసులు తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన టీచర్‌ను టెర్మినేట్ చేయాలి

» గురుకుల పాఠశాల ఎదుట ధర్నా

» చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఫిర్యాదు


చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఫిర్యాదు చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

గద్వాల క్రైం, అక్టోబ రు 31 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల విద్యార్థిని చితకబాదిన టీచర్ శ్రీకాం త్‌పై చర్యలు తీసుకొని అయనను వెంటనే టెర్మినేట్ చేయాలని విద్యార్థి సంఘా ల నాయకులు డిమాండ్ చేస్తూ శుక్రవారం జిల్లా కేంద్రంలోని చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులు విద్యార్థులను ఇలా ఇష్టానుసారంగా చితకబాదడం దారుణమన్నారు. ఇలా విద్యార్థిని ఇష్టం వచ్చినట్లు చితకబాదిన ఉపాధ్యాయుడు శ్రీకాంత్‌ను వెంటనే టెర్మినేట్ చేయాలని డిమాండ్ చేస్తూ వీరాపురంలోని గురుకుల పాఠశాల ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పీడీఎస్‌యూ హలీంపాష, పీవైఎల్ దానయ్య, యూఎస్‌ఎఫ్ఐ వామన్‌పల్లి రంగస్వామి, ప్రజాపంట్ నాగన్న ఉన్నారు.

క్రైం కార్నర్

భవన నిర్మాణ కార్మికులకు విద్యుత్ షాక్

» ఒకరి పరిస్థితి విషమం, ఇద్దరికి తప్పిన ప్రాణాపాయం


గాయపడిన వారిని 108 అంబులెన్స్‌లో జిల్లా ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

బిజినేపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ పనులు చేస్తున్న కార్మికులకు ప్రమాదవశాత్తు నిర్మాణ పనులు చేస్తున్న ఇంటి ముందు ఉన్న విద్యుత్ తీగలకు వారి చేతుల్లో ఉన్న ఇనుప సీకులు తగిలి విద్యుత్ షాక్ గురై శ్రీనివాసులు అనే వ్యక్తి శరీరం కాలిపోయి తీవ్రంగా గాయపడ్డాడు. మరో ఇద్దరు కార్మికులు చెన్నయ్య, యాదయ్య స్వల్ప గాయాలతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. శుక్రవారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రంలోని జిల్లా సహహకార సంఘం కోఆపరేటివ్ బ్యాంక్ పక్కన నూతనంగా నిర్మిస్తున్న ఇంటికి సెంట్రింగ్ పనులు చేసేందుకు కార్మికులు వచ్చారు. స్లాబ్ వేసేందుకు ఇనుప సీకులను పైకీ లాగుతున్న క్రమంలో చేతుల్లో ఉన్న సీకులు విద్యుత్ తీగలకు తగిలి పెద్ద మంటలు వ్యాపించడంతో పాటు కేకలు వినపడడంతో వెంటనే చుట్టు పక్కల వారు అప్రమత్తమై సీకులను వారి నుంచి దూరంగా జరిపి ప్రాణనష్టం జరగకుండా నిలువరించారు. వెంటనే 108కు సమాచారం ఇవ్వడంతో ఈఎంటీ రవికుమార్, పైలెట్ వెంకటయ్య ఘటన స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108లో జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


రాజు(ఫైల్)

అలంపూరుచౌరస్తా, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): చిరు ఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్న యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై తిరిగిరాని లోకాలకు పోయాడు. ఉండవల్లి మండల కేంద్రానికి చెందిన రాజు అలియాస్ చింటు (32) అనే యువకుడు కర్నూలు నగరంలో ఓ లాడ్జిలో చిరుఉద్యోగం చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొచ్చేవాడు. శుక్రవారం రాత్రి డ్యూటీ ఉండటంతో ఇంటి నుంచి సాయంత్రం బైక్‌పై బయలుదేరాడు. సరిగ్గా జాతీయరహదారిపైకి ఎక్కగానే హైదరాబాదు నుంచి కర్నూలు వైపు వెళ్తున్న ఓ స్కార్పియో కారు అతి వేగంగా ఢీ కొంది. దీంతో తీవ్ర గాయాలైన రాజును 108 అంబులెన్స్‌లో తరలిస్తుండగానే మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు 108సిబ్బంది తెలిపారు. మృతుడికి భార్య అమ్ములు, నాలుగేళ్ల వయసు బాబు, 5 నెలల బాబు ఉన్నారు. వీరితో పాటు మతిస్థిమితంలేని తమ్ముడు కూడా ఇతడిపై ఆధారపడి జీవించేవాడు. రాజు మృతితో కుటుంబం వీధిన పడింది. దీంతో ఉండవల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఆటో, ఆర్టీసీ బస్సు ఢీ

- ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

బిజినేపల్లి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): బిజినేపల్లి మండలం వట్టెం గ్రామం సమీపంలో ఎదురెదురుగా వస్తున్న ఆటో, ఆర్టీసీ బస్సు వేగంగా ఢీకొనడంతో ఆటో డ్రైవర్ మహేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. శుక్రవారం స్థానికులు తెలిపిన వివరాల మేరకు... వనపర్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హైదరాబాద్ నుంచి వనపర్తి వెళ్తుండగా బిజినేపల్లి నుంచి వట్టెం వైపు నాగర్‌కర్నూల్ మండలంలోని పెద్దాపూర్ గ్రామానికి చెందిన మహేష్ ఆటో నడుపుకుంటూ వేగంగా వెళ్లి ఢీకొట్టుకున్నారు. ఆటోలో డ్రైవర్ మహేశ్‌తో పాటు ప్రయాణికులు ఎవరూ లేకపోవడంతో అటుగా వెళ్తున్న వాహనదారులు, స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. బాధితుడిని జిల్లా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని..

మహమ్మదాబాద్, (ఆంధ్రజ్యోతి): ఎదురెదురుగా రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని వ్యక్తికి గాయాలైన ఘటన శుక్రవారం రోజు మహమ్మదాబాద్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... నంచర్ల గ్రామానికి చెందిన కృష్ణయ్య తన ద్విచక్ర వాహనంపై మహబూబ్‌నగర్ వైపు వెళ్తుండగా మండల కేంద్రంలోని ఫంక్షన్ హాల్ సమీపంలో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని మలుపు తీసుకునే క్రమంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. కృష్ణయ్యకు గాయాలు కావడంతో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

8 క్వింటాళ్ల పత్తి దగ్ధం


కాలిపోయిన పత్తి

మదనాపురం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లా మదనాపురం మండలంలోని నర్సింగాపురం గ్రామంలో సుమారు ఎనిమిది క్వింటాళ్ల పత్తి దగ్ధమైంది. బాధిత రైతు శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. వర్షానికి తడిచిన పత్తిని శుక్రవారం గ్రామంలోని సీసీ రోడ్డుపై ఆరబెట్టారు. మధ్యాహ్నా సమ యంలో అనుకోకుండా పత్తి అంటుకోవ డంతో స్థానికులు గమనించి ఆర్పడం జరిగింది. అప్పటికే దాదాపు పత్తి కాల డంతో రైతుకు 50వేల నష్టం జరిగింది. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు బిట్లియాదగిరి డిమాండ్ చేశారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరికి జైలు శిక్ష

కల్వకుర్తి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మద్యం తాగి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడిన ఇద్దరికి న్యాయాధికారి జైలు శిక్ష విధించినట్లు కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్ఐ కథనం ప్రకారం... కల్వకుర్తి పట్టణంలోని గాంధీనగర్‌కు చెందిన ఖాజా మైనొద్దీన్, వెల్దండ మండలం రాచూరు గ్రామానికి చెందిన కాటిక యాదయ్యలు డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డారు. శుక్రవారం వారిని కోర్టులో హాజరుపర్చగా న్యాయాధికారి ఖాజామైనొద్దీన్‌ఖాన్‌కు రెండు రోజుల జైలు శిక్ష, 100రూపాయల జరిమానా, కె.యాదయ్యకు ఒక రోజు జైలు శిక్ష, రూ.600 జరి మానా విధించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పట్టుబడిన ఆరుగురు..

● తాడూరు,(ఆంధ్రజ్యోతి) : తాడూరు మండల కేంద్రంలోని కల్వకుర్తి నంద్యాల ప్రధాన రహదారిపై గత రెండు మూడు రోజులుగా నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఆరుగురు పట్టుబడ్డారు. వారిని శుక్రవారం కోర్టులో హాజరు పర్చగా న్యాయాధికారి శృతి దూత ఒక రోజు కోర్టు ఆవరణలో నిల్చొని ఉండే శిక్షను విధించారు. ఈ క్రమంలో డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడి శిక్షను అనుభవించిన వారిలో బాల్‌రెడ్డి, కొమ్ము నరేష్, ముకురాల వెంక టయ్య, బాలస్వామిగౌడ్, వెంకటేశ్‌గౌడ్, మంతటి ఆంజనేయులుగౌడ్‌లు కోర్టు ఆవరణలో నిల్చొనే శిక్షను పూర్తి చేసుకున్నట్లు ఎస్ఐ గురుస్వామి తెలిపారు.

మరో ముగ్గురికి...

తెలకపల్లి, (ఆంధ్రజ్యోతి): డ్రంకెన్ డ్రైవ్ కేసులో ముగ్గురికి శిక్ష పడ్డట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు. దీనికి సంబంధించిన వివరాల ప్రకారం... ఆలేరుకు చెందిన మామిళ్ల మల్లేష్‌కు 20 రోజులు శిక్ష విధించబడింది. రాములు అనే వ్యక్తికి రూ.1500 జరిమానా, రైసింగ్ ఆఫ్ ది కోర్ట్ విధించబడిందని, అలాగే, భోగరాజు రాములుకు రూ.1500 జరిమానాను స్టిల్ రైసింగ్ ఆఫ్ ది కోర్ట్ విధిస్తూ నాగర్‌కర్నూల్ జేఎఫ్‌సీఎం న్యాయాధికారి శృతిదూత తీర్పు ఇచ్చినట్లు ఎస్ఐ తెలిపారు.

వివాహిత అదృశ్యం

దామరగిద్ద, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : దామరగిద్ద మండల పరిధిలోని మద్యల్‌భీడు గ్రామనకి చెందిన లింగమ్మ (23) తమ కుమారుడు నరేష్ (3) తో పాటు ఇదే నెల 26వ తేదీన ఉదయం 9.30 గంటలకు పొలానికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలుదేరింది, తిరిగి ఇంటికి సాయంత్రం వరకు రాలేదని ఆమె భర్త మొన్నప్ప శుక్రవారం దామరగిద్ద పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బి.అరుణ్ తెలిపారు.



వీరు మారరా?

● గురువుల పనితీరుపై విమర్శల వెల్లువ

» పాఠశాలల్లో పెరుగుతున్న కీచక ఉపాధ్యాయులు

» పర్యవేక్షణ లేకపోవడంతోనే ఇలా...

» లైంగిక వేధింపులకు పాల్పడ్డ టీచర్‌కు అదే పాఠశాలకు మళ్లీ పోస్టింగు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పిల్లలకు ఆదర్శంగా ఉండాల్సిన గురువులు నిత్యం ఏదో ఒక పాఠశాలలో తరచూ వివాదాస్పదమవుతున్నారు. విద్యార్థుల ఎదుటే కొందరు ఉపాధ్యాయుల గొడవకు దిగుతున్న ఘటనలు ఉమ్మడి జిల్లా పలు పాఠశాలల్లో చోటుచేసుకున్నాయి. అది చదువులపై ప్రభావం పడుతుందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకపోవడం చాలావరకు ఇలాంటిఘటనలుచోటు చేసుకుంటున్నాయి.

● **కొరవడిన పర్యవేక్షణతో..**

ప్రభుత్వ పాఠశాలలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ లేకపోవడంతోనే కొందరు ఉపాధ్యాయులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. పాఠశాలల్లో ఒకరంటే ఒకరికి పడకపోవడం, ఎవరికి వారే ఉన్నతాధికారులకు ఫిర్యాదులు ఇచ్చుకోవడం పరిపాటిగా మారింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బోధన కుంటుపడుతున్నది. ఉమ్మడి పాలమూరు ఐదు జిల్లాలకు రెగ్యులర్ డీఈవోలు లేకపోవడం, అందరూ ఇన్‌చార్జిలే ఉండటం... 67 మండలాలకు ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఎంఈవోలు ఉండటం, మిగతా వారంతా సీనియర్ గజిటెడ్ ప్రధానోపాధాయులు ఎంఈవోలుగా ఉన్నారు. దీంతో పర్యవేక్షణ అంతంత మాత్రంగా ఉండటం.. ఇందుకు ప్రధానకారణంగా చెప్పుకోవచ్చు.

● **ప్రభుత్వ పాఠశాలల్లో కీచక ఉపాధ్యాయులు**

మహబూబ్‌నగర్ జిల్లాలో గత మూడు నెలల్లో కీచక ఉపాధ్యాయలపై నలుగురిపై పోక్సో కేసులు నమోదు అయ్యాయంటే ఉపాధ్యాయల తీరు ఎలా ఉందో అర్థం అవుతోంది. పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు విద్యార్థినుల పట్ల లైంగిక వేధింపులకు పాల్పడిన నాలుగు ఘటనలు వెలుగులోకి వచ్చాయి. మహబూబ్‌నగర్ మండల పరిధిలోని ధర్మాపూర్ ఉన్నత పాఠశాల, మహబూబ్‌నగర్ అర్బన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత వీరన్నపేట పాఠశాల, రాజాపూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మహబూబ్‌నగర్ అర్బన్ పరిధిలోని షాషాబ్‌గుట్ట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయులు విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడ్డారు.

వీరందరినీ విద్యాశాఖ విధులనుంచి సస్పెండ్ చేసింది. ఓ ఉపాధ్యాయుడు జైలు జీవితం గడుపుతున్నారు.

● **ఆ టీచర్‌కు అక్కడే పోస్టింగ్**

మహబూబ్‌నగర్ మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు విద్యార్థులను లైంగికంగా ఇబ్బందులకు గురిచేశారన్న దానిపై కేసు నమోదు అయింది. అతన్ని విధుల నుంచి సస్పెండ్ చేశారు. కానీ రాజకీయ ఒత్తిళ్లతో మూడు నెలలు ముగియక ముందే విధుల్లోకి తీసుకున్నారు. మళ్లీ ధర్మాపూర్ ఉన్నత పాఠశాలలో విధుల్లోకి తీసుకోవడంపై జిల్లా విద్యాశాఖ తీరుపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు.

వరదతో నల్లబారిన పత్తి

» ఆందోళన చెందుతున్న అన్నదాతలు


యాదిరెడ్డిపల్లి కాలనీ సమీపంలో వరద కారణంగా నల్లబారిన పత్తి

తాడూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల రెండు రోజుల క్రితం కురిసిన భారీ వర్షాల కారణంగా మండల కేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో పత్తి పంట సాగు చేసిన అన్నదాతల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఆరుగాలం కష్టం చేసి తీరా చేతికంది వచ్చిన పంటను తీసుకునే క్రమంలో మొంథా తుఫాన్ కారణంగా భారీ వర్షం కురవడం మూలంగా లోతట్టు ప్రాంతాల్లో పత్తి పంటలన్నీ వరద ప్రవాహానికి మునిగిపోయాయి. ప్రస్తుతం తాడూరు మండల వ్యాప్తంగా అధికారుల లెక్కల ప్రకారం 3137 ఎకరాల్లో పంట నష్టం జరిగిందని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమికంగా నివేదిక సిద్ధం చేసినప్పటికీ ఆ విస్తీర్ణం పెరిగే అవకాశమే ఎక్కువగా ఉంది. వర్షానికంటే ముందు రైతు కూలీల కొరత కారణంగా ఏరుకోలేని పత్తి పరిస్థితి... వరద ప్రవాహం అనంతరం తెల్లబంగారం కాస్త బురదమయంగా మారిపోయింది. మొత్తంగా పత్తి పంటలపై ఎన్నో ఆశలుగా ఉన్న అన్నదాతల పరిస్థితి తీవ్ర ఆందోళనకరంగా మారింది.

ప్రజాప్రతినిధు లు, వ్యవసాయ శాఖ అధికారులు స్పందించి నష్టపోయిన రైతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నష్ట పరిహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకోవాలని పత్తి రైతులు కోరుతున్నారు.

ఉధృతి తగ్గని దుందుభీ

మండలంలో ప్రవహించే దుందుభీ నది ప్రవాహం ఉధృతంగా కొనసాగుతున్నది. శుక్రవారం రోజు సైతం నదీ తీరం వెంట దుందుభీ ప్రవాహం ఉరకలేస్తుండడంతో తీరం వైపు ఎవరూ వెళ్లకూడదంటూ పోలీసులు పహారా కాస్తున్న పరిస్థితులు నెలకొన్నాయి. గత రెండు రోజుల క్రితం కురిసిన వర్షాల కారణంగా దుందుభీ నది ప్రవాహం ఉగ్రరూపం దాల్చింది. మొత్తంగా నది తీరం వెంట ఉన్నగ్రామాల్లో ఏ క్షణంలో ఏ ఉపద్రవం వస్తుందోనని ప్రజలు భయాందోళనకు గురయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. సిర్సవాడ, ఎట్టిధార్‌పల్లి, నాగదేవ్‌పల్లి గ్రామాల రైతులకు సంబంధించిన వ్యవసాయ పంటలు సైతం నది అవతలి భాగంలో ఉన్నప్పటికీ రాకపోకలు లేకపోవడం మూలంగా అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మొత్తంగా ఈ ఏడాది జూన్ నుంచి ప్రారంభమైన దుందుభీ నది ప్రవాహం నవంబరులో సైతం కొనసాగుతున్న పరిస్థితి నెలకొంది.

పెద్దగుట్ట మైనింగ్‌లో టిప్పర్ డ్రైవర్ మృతి

పెబ్బేరురూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పెబ్బేరు మండల పరిధిలోని ఏటిగట్టు శాఖాపూర్‌లో పెద్దగుట్ట మైనింగ్‌లో శుక్రవారం టిప్పర్ డ్రైవర్ మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ యుగంధర్‌రెడ్డి వివరాల ప్రకారం.. కొత్తకోట మండలం నాటవెల్లి గ్రామానికి చెందిన బాలరాజు మృతి చెందాడు. మృతుడికి భార్యతో పాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. అతని భార్య అనురాధ ఫిర్యాదు చేసిందని ఎస్ఐ తెలిపారు. తన భర్త బాలరాజుగౌడ్ వై.శాఖాపూర్ గ్రామంలో ఉన్న ఎస్వీఆర్ మినరల్స్ కంపెనీలో గత రెండు సంవత్సరాల నుంచి టిప్పర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం ఉదయం 9 గంటల సమయంలో పనికి వెళ్తున్నానని ఇంటి నుంచి వెళ్లాడు. తరువాత ఉదయం పదిన్నర గంటల సమయంలో తనకు ప్రమాదం సమాచారం తెలిసిందని మృతుని భార్య తెలిపారని ఎస్ఐ తెలిపారు.

పని చేస్తున్న చోట ఒక హిటాచీతో అక్కడ ఉన్న ఒక స్తంభాన్ని తీస్తుండగా ప్రమాదవశాత్తు స్తంభం తన భర్త తలపై పడింది. దీంతో తలకు రక్త గా యం అయిందని చెప్పి తనని వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తున్నా మని చెప్పడం జరిగిందని మృతుని భార్య తెలిపిందన్నారు.

ప్రమాదం లో మృతి చెం దిన వెంటనే ఫిర్యాదురాలు వనపర్తి ప్ర భుత్వ ఆసుప త్రికి వచ్చి చూ డగా తన భర్త మార్గమధ్యంలో చనిపో యాడని తెలిసింది.

తన భర్త చావుకి కారణమైన హిటాచి ఆపరేటర్ కృష్ణపై చట్టరీత్యా చర్య తీసుకోవాలని మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

లైసెన్స్ లేకుండానే మందుల అమ్మకం

» ఐదేళ్లు జైలు శిక్ష - రూ. 1.20 లక్షల జరిమానా

గద్వాల క్రైం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి లైసెన్స్ లేకుండా మందులు(మెడిసిన్స్) అమ్మిన వ్యక్తికి 5 సంవత్సరాలు జైలు శిక్ష పడింది. ఈ సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకొంది. ఇందుకు సంబంధించి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ వినయ్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వినోదాచారి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గద్వాల పట్టణంలోని జమ్మిచేడుకు చెందిన జయరాముడు నిర్మల క్లినిక్ చెందిన ఆర్ఎంపీ డాక్టర్ డ్రగ్ లైసెన్స్ లేకుండా 35 రకాల మందులను ఒక కాటన్‌లో తన మోటార్ సైకిల్‌పై క్లినిక్‌కు 2015, ఆగస్టు 6న తీసుకొస్తుండగా అప్పటి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ పట్టుకొని ఆరా తీశారు. ఇందుకు సంబంధించిన ఇన్‌వాయిస్‌లను చూపించమని కోరగా, లైసెన్స్ లేదని చెప్పడంతో అప్పటి ఎస్ఐ అంజాద్‌అలీకి సాక్షుల సమక్షంలో పంచనామా చేసి కేసు నమోదు చేయించారు. అయితే ఆ కేసు వివరాలకు సంబంధించి శుక్రవారం గద్వాల జిల్లా కోర్టులో వాదోపవాదాలు విని సాక్షాధారాలను పరిశీలించి ప్రాసిక్యూటర్ వాదనలు నిరూపితం అయ్యాయి. దీంతో డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ యాక్ట్ ప్రకారం సెక్షన్ 27, సెక్షన్ 28 ప్రకారం ఐదేళ్ల జైలు శిక్ష, రూ.లక్ష జరిమానా విధిస్తున్నట్లు జిల్లా న్యాయాధికారి ప్రేమలత తీర్పు ఇచ్చారు. సెక్షన్ 28 ప్రకారం 6 నెలలు అదనపు శిక్షతో పాటు 20వేల జరిమానా విధిస్తున్నట్లు తీర్పు ఇచ్చినట్లు తెలిపారు.

చెట్టుకు ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

అచ్చంపేట రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక అత్తగారింటికి వచ్చి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఘటన ఇది. పోలీసుల కథనం ప్రకారం... నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం ఉమ్మాపూర్ గ్రామానికి చెందిన వెంకటయ్య గురువారం అత్తగారి ఊరు హాజీపూర్ వచ్చి రాత్రి భోజనం చేశాడు. ఆ తర్వాత ఏం జరిగిందో తెలియదు కానీ, చెట్టుకు ఉరేసుకొని అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని మృతుడి భార్య హైమావతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. పోలీసులు ఫిర్యాదు నమోదు చేసుకుని శుక్రవారం వెంకటయ్య మృతదేహాన్ని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయించారు. స్థానిక ఎస్ఐ ఇందిర కేసు నమోదు చేస్తున్నారు.

ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్

కేటీదొడ్డి ఠాణాకు అటాచ్‌మెంట్

గట్టు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): కేటీదొడ్డి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బంది తక్కువ సంఖ్యలో ఉన్న కారణంగా గట్టు పోలీస్ స్టేషన్ నుంచి ఇద్దరు పోలీస్ అధికారులను అటాచ్‌మెంట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గట్టు పోలీస్ స్టేషన్‌తో పాటు గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్ నుంచి కూడా మరొక హెడ్ కానిస్టేబుల్‌ను రిలైన్డ్ చేశారు. గట్టు పోలీస్‌స్టేషన్ నుంచి ఏఎస్ఐ బాలునాయక్, హెడ్‌కానిస్టేబుల్ బి.కృష్ణుడును కేటీదొడ్డి పోలీస్ స్టేషన్‌కు అటాచ్ చేశారు. గద్వాల రూరల్ పోలీస్ స్టేషన్‌నుంచి హెడ్‌కానిస్టేబుల్ తిమ్మప్పను రిలైన్డ్ చేశారు. వీరిని రిలీవ్ చేయాలని ఆయా పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌వోలకు ఆదేశాలు జారీ అయ్యాయి.

విద్యుదాఘాతంతో

యువకుడి దుర్మరణం


కార్తీక్ నాయక్(ఫైల్)

భూత్పూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ యువకుడు దుర్మరణం చెందాడు. ఈ సంఘటన శక్రవారం భూత్పూర్ మునిసిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మునిసిపాలిటీ పరిధిలోని గోప్లాపూర్ గ్రామానికి చెందిన పాత్లావత్ కార్తీక్(19) ఇంటి దగ్గర పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. మృతుడు డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. గోప్లాపూర్ గ్రామానికి చెందిన తుల్యానాయక్, సావిత్రిలకు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు కార్తీక్ చదువుతున్నాడు. అయితే తుల్యానాయక్‌కు ప్రభుత్వం నుంచి ఇందిరమ్మ ఇల్లు మంజూరు అయ్యింది. ఈ సందర్భంగా ఇంటి నిర్మాణం చేపడుతుండగా ఇంటికి నీరు పోస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు కార్తీక్ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్రంగా గాయపడిన కార్తీక్‌ను చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా కేంద్రంలోని ఆసుపత్రికి తలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు.. ఉన్నత చదువులు చదువుతున్న తరుణంలో ఇలాంటి దుర్ఘటన చోటు చేసుకోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

యాదాద్రికి తరలిన క్రీడాకారులు


యాదాద్రికి తరలివెళుతున్న క్రీడాకారులు

మక్తల్/కొత్తకోట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడలకు ఎంపికైన 72మంది బాలబాలికలు నారాయణపేట జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాలం ఆధ్వర్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాకు తరలివెళ్లారు. ఈ సందర్భంగా శుక్రవారం గోపాలం మాట్లాడుతూ నవంబరు 1 నుంచి 2వరకు రాష్ట్రస్థాయి సైక్లింగ్ క్రీడల్లో క్రీడాకారులు పాల్గొంటారన్నారు. రాష్ట్ర స్థాయిలో రాణించిన వారిని జాతీయ స్థాయికి పంపిస్తారన్నారు. కార్యక్రమంలో పీఈటీలు రమేష్‌కుమార్, పీడీలు రేణుక, స్వప్న, అనూష, దివ్య, ప్రమీల, రాధ, జ్యోతి, నందిని, కీర్తన, ఐశ్వర్య పాల్గొన్నారు.

● కొత్తకోట పట్టణంలోని ఎస్సీ బాలికల గురుకుల కళాశాలకు చెందిన 15 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి సైక్లింగ్ పోటీలకు శుక్రవారం తరలివెళ్లారు. యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలో నవంబరు 1, 2వ తేదీల్లో జరుగు సైక్లింగ్ పోటీల్లో పాల్గొనడం జరుగుతుందని ప్రిన్సిపాల్ మాధవి తెలిపారు. పోటీలకు వెళ్తున్న విద్యార్థులకు కోచ్ గోపాలం, పీడీ స్వప్న, దివ్యభారతి అభినందనలు తెలిపారు.

రేపు ఉమ్మడి జిల్లా సాఫ్ట్‌బాల్ జట్ల ఎంపిక

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలలో నవంబరు 7 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సీనియర్స్ మహిళ సాఫ్ట్‌బాల్ టోర్నీలో పాల్గొనే ఉమ్మడి మహిళల జట్ల ఎంపికలను ఈ నెల 2న నిర్వహిస్తున్నట్లు జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధులు రాఘవేందర్, నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌జూనియర్, సీనియర్ రాష్ట్రస్థాయి టోర్నీలో పాల్గొన్న వారు సీనియర్ టోర్నీలో ఆడటానికి అర్హులని పేర్కొన్నారు. ఉదయం 10 గంటలకు సంబంధిత ధ్రువ పత్రాలతో స్టేడియం మైదానంలో సాఫ్ట్‌బాల్ కోచ్‌కు రిపోర్టు చేయాలని కోరారు.

పీయూలో ఎంఈడీ విద్యార్థులకు వైవా పరీక్షలు


పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థులు

పాలమూరు యూనివర్సిటీ, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): పాలమూరు యూనివర్సిటీలో శుక్రవారం ఎంఈడీ రెండవ సంవత్సరం విద్యార్థులకు డిసర్టేషన్ వైవా పరీక్షలు నిర్వహించారు. ఈ వైవాకు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టర్ డి.సునీత బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మన్ ఇన్ ఎడ్యుకేషన్ పాలమూరు యూనివర్సిటీ, డాక్టర్ దుర్గేశం ఇంటర్నల్ ఎగ్జామినర్స్‌గా హాజరై విద్యార్థులకు వైవా నిర్వహించారు. ఈ పరీక్షలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆదెర్ల కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. మొత్తం 32 మంది విద్యార్థులు ఈ సంవత్సరం తమ ఎంఈడీ కోర్సును విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. మీరు అందరూ త్వరలో సెట్, నెట్ పరీక్షల్లో ఉత్తీర్ణులై, భవిష్యత్తులో పీహెచ్‌డీ పూర్తి చేసి అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా రాణించాలని ఆకాంక్షించారు. వైవా కార్యక్రమంలో ఇంటర్నల్ ఎగ్జామినర్స్‌గా డాక్టర్ బషీర్‌అహ్మద్, డాక్టర్ జంగం విశ్వనాథ్, డాక్టర్ జయనాయక్, డాక్టర్ విజయలక్ష్మి విధులు నిర్వహిచారు.

రెండు ఇసుక ట్రాక్టర్లు సీజ్

కల్వకుర్తి, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను గుర్తించి సీజ్ చేసినట్లు కల్వకుర్తి ఎస్ఐ జి.మాధవరెడ్డి తెలిపారు. వివరాలు ఎస్ఐ కథనం ప్రకారం.. కల్వకుర్తి మండల పరిధిలోని లింగసానిపల్లి గ్రామం నుంచి రెండు ఇసుక ట్రాక్టర్లు ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తుండగా గుర్తించినట్లు తెలిపారు. వారిని విచారించగా ఒక ట్రాక్టర్ వంశీ, మరొక ట్రాక్టర్ నరేష్‌లదిగా గుర్తించినట్లు పేర్కొన్నారు. ట్రాక్టర్లను సీజ్ చేసి వారిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు.

ఇసుక లారీ పట్టివేత

అలంపూరుచౌరస్తా, అక్టోబరు 31, (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరి ధిలోని పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో శుక్రవారం పోలీసు సిబ్బంది అబ్దుల్ బాషా, రవికుమార్‌లు తనిఖీలు చేస్తుండగా అనుమానస్పదంగా ఏపీ నుంచి తెలంగాణలోకి వస్తున్న ఓ లారీని తనిఖీ చేశారు. అందులో ఇసుక ఉండటం తో డ్రైవర్ రాముడును విచారించగా అనుమతులు లేకుండా అనుమతులు లేకుండా హైదరాబాదుకు రవాణ చేస్తున్నట్లు తెలపడంతో స్టేషన్‌కు తరలిం చి కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.



న్యూస్ బాక్స్

విద్యార్థులకు పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

మహబూబ్‌నగర్ టౌన్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గురుకుల గిరిజన డిగ్రీ కళాశాల (మహిళ)లో శుక్రవారం పాల పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థులకు ఎస్‌బీఐ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. రాబోయే కాలంలో పుట్టగొడుగుల పెంపకాన్ని స్వయంగా చేసి ఉపాధి పొందడానికి ఈ శిక్షణ ఎంతో తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ డైరెక్టర్ శ్రీనివాస్, సుధాకర్ వాసంతి పిళ్ళై, అధ్యాపకులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో వైద్య సదుపాయాలు



గ్రామస్థులకు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మిడ్జిల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ప్రతీ గ్రామంలో వైద్య సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, గ్రామీణ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు శివ కాంత్ అన్నారు. శుక్రవారం మండలంలోని వాడియాల గ్రామంలోని వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. తేమడ, ఎక్స్‌రే, షుగర్, బీపీ, ఇతర పరీక్షలను చేశారు. కార్యక్రమంలో పల్లె దవఖాన డాక్టర్ శ్రీనివాసులు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ అయ్యుబ్‌ఖాన్, కార్యదర్శి అంజనేయులు, సిబ్బంది పాల్గొన్నారు.

15న జడ్చర్లలో సదర్ ఉత్సవం

జడ్చర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు నాయకులు శుక్రవారం తెలిపారు. పట్టణంలోని యాదవ సంఘం కార్యాలయంలో ఉత్సవ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండిగిరి యాదవ్, ప్రధానకార్యదర్శిగా వంగూరి శ్రీనివాస్‌యాదవ్ ఎంపికయ్యారు. ఈ నెల 15న పట్టణంలోని నేతాజీచౌరస్తాలో సాయంత్రం 5గంటలకు సదర్ ఉత్సవాలు నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు వెల్లడించారు. కార్యక్రమంలో శ్రీశైలంయాదవ్, విశ్వేశ్వర్‌యాదవ్, రవికుమార్, మచ్చలశ్రీను, రమేశ్, ప్రభాకర్, నిరంజన్, శ్రీకాంత్, చెన్నకేశవులు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేత

మిడ్జిల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాణిపేటకు చెందిన తుల్జారాం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి రూ.2.50లక్షల ఎల్‌వోసీ మంజూరు కాగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు మల్లేశ్ వారికి అందజేశారు. ఎల్‌వోసీ మంజూరు చేయించిన ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.


'రైతులకు నష్టపరిహారం చెల్లించాలి'

జడ్చర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : తుఫాన్ కారణంగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే పరిహారం చెల్లించాలని భారతీయ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంటీ బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. మండలంలో పెద్ద ఆదిరాల, ఎక్వాయ్‌పల్లి గ్రామాలలో వరిచేను నేలరాలిందని, రైతులు తీవ్రనష్టానికి గురయ్యారని తెలిపారు.

అక్రమ డిప్యుటేషన్లు రద్దు చేయాలి: టీఎస్ యూటీఎఫ్

నవాబ్‌పేట, అక్టోబరు 31(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలలకు పంపిన ఉపాధ్యాయులను వెనక్కి రప్పించి డిప్యుటేషన్లు రద్దు చేయాలని టీఎస్ యూటీఎఫ్ మండల అధ్యక్ష కార్యదర్శులు అయ్యూబ్ ఖాన్, రమేశ్, కృష్ణయ్య, వేణుగోపాల్ వర్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో ఉపాధ్యాయుల సర్దుబాటు మొదట కాంప్లెక్స్ పరిధిలో చేపట్టి, ఆ తర్వాత మిగిలి ఉంటే మండల, జిల్లా చేసుకోవాలని పేర్కొన్నారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా అధికారులు తమకు ఇష్టమైన వారికి కోరుకున్న చోట జిల్లా కేంద్రంతో పాటు అనుకూల ప్రదేశాల్లో ఇచ్చి సాధారణ ఉపాధ్యాయులను దూర ప్రాంతాలకు పంపించడం తగదని తెలిపారు. ప్రభుత్వ బడుల బలోపేతానికి ఏర్పాటు చేసిన బడిబాట, టీఎల్ఎం నిర్వహించి అడ్మిషన్లు పెంచాలని వారు కోరారు.

భక్తిశ్రద్ధలతో గో పూజ



పూజలు చేస్తున్న భక్తులు

జడ్చర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గొల్లపల్లి లలితాంబిక తపోవనంలో గోపాష్టమి సందర్భంగా వీహెచ్‌పీ లలితాపారాయణం నిర్వహించారు. అనంతరం గోశాలలోని గోవులకు పూజలు చేశారు. జిల్లా ఉపాధ్యక్షుడు జగ్‌పాల్ రెడ్డి, లావణ్య, భువనేశ్వరి, చిరంజీవులు, శ్రీను, సుదర్శన్, పద్మజ, మనోజ, అరుణ పాల్గొన్నారు.



జడ్చర్లలో విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



భూత్పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

ఐక్యతకు ప్రతీకగా రన్ ఫర్ యూనిటీ

- సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి సందర్భంగా ఘన నివాళి
- పోలీసుల ఆధ్వర్యంలో 2కే రన్

జడ్చర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : ఉక్కుమనిషి సర్దార్‌వల్లభాయ్‌పటేల్ 150వ జయంతిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జడ్చర్ల మునిసిపాలిటీలోని ఎస్వీపీ నగర్‌లో సర్దార్ వల్లభాయ్ పటేల్ విగ్రహానికి పలు పార్టీల నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.



హన్వాడలో 2కే రన్‌లో పాల్గొన్న పోలీసులు, యువకులు

అఖండ భారత్ నిర్మాణంలో పటేల్ పాత్ర మరువలేనిది: ఎంపీ

మహబూబ్‌నగర్ విద్యావిభాగం: దేశసమైక్యత కోసం పోరాడిన సర్దార్ వల్లభాయ్ పటేల్ అఖండ భారత్ నిర్మాణంలో చేసిన సేవలు మరువలేనివని ఎంపీ డీకే అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

దేవరకద్ర: మండల కేంద్రంలోని పోలీసుల ఆధ్వర్యంలో అమ్మాపూర్ చౌరస్తా నుంచి డోకూర్ గేటు వరకు ర్యాలీ నిర్వహించారు.

మిడ్జిల్: మండల కేంద్రంలో రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని గ్రామస్థులు, యువకులతో కలిసి ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడు 2 కిలోమీటర్ల రన్నింగ్‌లో పాల్గొన్నారు.

రాజాపూర్: మండల కేంద్రంలోని స్థానిక సబ్ స్టేషన్ కార్యాలయం నుంచి కుచ్చర్‌కల్ గ్రామం వరకు నాయకులు, యువకులు, పోలీస్ శాఖ సిబ్బంది రన్ చేశారు. ఎస్‌ఐ శివానందం గౌడ్, రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలోని కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ తిరుపతయ్య అధ్యక్షతన సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

హన్వాడ: మండల కేంద్రంలో ఎస్‌ఐ వెంకటేశ్ ఆధ్వర్యంలో హన్వాడ నుంచి పెద్దదర్పల్లి గేట్ వరకు రన్ నిర్వహించారు.

భూత్పూర్: మునిసిపాలిటీలోని సారిక టౌన్‌షిప్‌లో 2కే రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని పోలీసుల ఆధ్వర్యంలో చేపట్టారు. సీఐ రామకృష్ణ, విజయ్‌గౌడ్, రవి పాల్గొన్నారు.

మూసాపేట: మూసాపేట పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో వేములస్టేజీ, వేముల గ్రామం వరకు 2కే రన్ నిర్వహించారు. అడ్డాకులలో కాటవరం నుంచి రాంచంద్రాపూర్ వరకు పరుగు నిర్వహించారు. ఎస్‌ఐలు వేణు, శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

నవాబ్‌పేట: మండల కేంద్రంలో ఎస్‌ఐ విక్రం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 2కే రన్‌లో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో జయరాములు, ఎంఈవో నాగ్యానాయక్, నాయకులు పాల్గొన్నారు.

మహమ్మదాబాద్: మండల కేంద్రంలోని బాలుర కళాశాల విద్యార్థులు, పోలీసులు 2కే రన్ నిర్వహించారు.

భూసమస్యలను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్



గండీడ్ లో వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్

గండీడ్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రైతులు దరఖాస్తు పెట్టుకున్న భూసమస్యలను వెంటనే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ ఆదేశించారు. శుక్రవారం గండీడ్, మహమ్మదాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయాలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా రెవెన్యూ సదస్సుల్లో ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? అవి ఏ దశలో ఉన్నాయని ఆరా తీవారు. సాదాబైనామా దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా ఫిర్యాదుదారులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. భూభారతి పనితీరులో సమస్యలు ఉన్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. తహసీల్దార్ మల్లికార్జున్‌రావు, విద్యాసాగర్‌రెడ్డి, ఆర్‌ఐ అహమ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పాఠశాల ఏజీఎం వెంకట్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని నారాయణ పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు స్టూడెంట్ లీడ్ కాన్ఫరెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషానైపుణ్యాలపై అవగాహన కల్పించారు. వారు నేర్చుకున్న అంశాలను విద్యార్థుల నుంచి రాబట్టారు. అదే విధంగా గణితం, సైన్స్ ప్రదర్శనలను నిర్వహించారు. ఏజీఎం వెంకట్‌రెడ్డి, కో ఆర్డినేటర్ స్వప్న హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజినిప్రియదర్శిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'అర్హతలేని వారిని నియమించడం సరికాదు'

పాలమూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడి (పర్సన్ ఇన్‌చార్జి)గా అర్హత లేని వారిని నియమించటం సరికాదని మాజీ పర్సన్ ఇన్‌చార్జి గంజి అంజనేయులు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రెండేళ్లనుంచి అధ్యక్షుడిగా పనిచేస్తున్న తనను కాదని మరొకరికి పదవి ఇవ్వటం సరికాదన్నారు. కాంగ్రెస్ పార్టీలో 35ఏళ్ల నుంచి పనిచేస్తున్న తనను కాదని, మరొకరికి ఇచ్చి బీసీలకు తగవు పెడుతున్నారని విమర్శించారు. పలువురి ఎమ్మెల్యేల మద్దతు తనకు ఉన్నప్పటికీ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి ఇతరులకు బాధ్యత అప్పగించటమంటే నాకు అన్యాయం చేయమే అన్నారు. ఇప్పటికైన పార్టీ సీనియర్‌ను గుర్తించాలన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయులు



ఉపాధ్యాయుల రాక కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

మహబూబ్‌నగర్ రూరల్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులు సమయపాలన పాటించకపోవడంతో విద్యార్థులు ఆరుబయట ఆడుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వివరాల్లోకి వెళితే.. మహబూబ్‌నగర్‌రూరల్ మండలంలోని వెంకటపూర్ ప్రాథమిక పాఠశాలను శుక్రవారం 'ఆంధ్రజ్యోతి' విజిట్ చేసింది. ఉపాధ్యాయులు ఉదయం 9:40 వరకు కూడా రాకపోవడంతో విద్యార్థులు పాఠశాల ఆవరణలో, ఆరుబయట ఆటలాడుకుంటూ ఉన్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు ఇక్కడ పనిచేస్తున్నా ఒక్కరు కుడా సమయానికి రాలేదు. దీనిపై హెచ్‌ఎంను వివరణ కోరగా పార్టు-2 పుస్తకాల కోసం ధర్మాపూర్ వెళ్లానని, మరో టీచర్ సెలవులో ఉందని చెప్పారు. మరో టీచర్ ఆలస్యంగా వచ్చినట్లు వివరణ ఇచ్చారు.

దేవాలయాల్లో కార్తీకమాస పూజలు



జడ్చర్ల వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

జడ్చర్ల, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేంకటే శ్వరస్వామి ఆలయంలో కార్తీక శుక్రవారం సందర్భంగా భక్తులు దీపాలను వెలిగించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు సుధీంద్రచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు



కలశ ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

మూసాపేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంకలమద్ది గుండ్ల చెరువు వద్ద పోచమ్మ తల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన పూజలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో జలాదివాసం ఉద్వాసనం, దేవతోత్తాపనం, పునఃమంటప ఆరాధన, యంత్రపూజ, మహాస్నపనం, గణపతి హోమం, హోమాలు, యోగిని దేవతా మూల హోమాలు, నవగ్రహ హోమం, క్షీరాదివాస హోమం, కలశస్థాపనం, వాస్తు హోమాలను నిర్వహించారు.

ఉబికి వస్తున్న పాతాళగంగ



బోరులో నుంచి వస్తున్న నీరు

నవాబ్‌పేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): మండలంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో చెరువులు, కుంటలు నీటితో కళకళలాడుతున్నాయి. మండలంలోని రుద్రారం గ్రామంలో చింతల్‌కుంట సమీపంలో ఉన్న కావలి వెంకటయ్యకు చెందిన బోరు బావి నుంచి కొద్ది రోజులుగా పాతాళగంగ నిరంతరం ఉబికి వస్తుంది. మొత్తం ఆయకట్టు మూడు ఎకరాలు ఉండగా, బోరు పెట్టిన నీరు అలాగే వస్తుండటంతో రైతు ఆనందం వ్యక్తం చేస్తున్నాడు.

విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోనిలోని బాలుర జూనియర్ కళాశాలలో ఫైనీర్ ద్వారా శిక్షణ పొందుతున్న వంద మంది విద్యార్థులకు ఎమ్మెల్యే సొంత నిధులతో రూపొందించిన ఎప్‌సెట్, నీట్ ఎంట్రెన్స్ స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకుడు గుండా మనోహర్, ప్రిన్సిపాల్ భగవంతాచారి పాల్గొన్నారు.

కందులు క్వింటాల్ రూ.5,802

దేవరకద్ర, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మార్కెట్ యార్డుకు గ్రామాల నుంచి రైతులు పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు తీసుకొచ్చారు. శుక్రవారం జరిగిన వేలంలో పెద్ద హంస గరిష్ఠంగా క్వింటాల్ రూ.1,779, కనిష్ఠంగా రూ.1,755, ఆర్‌ఎన్‌ఆర్ గరిష్ఠంగా రూ.2109, కనిష్ఠంగా రూ.1,980, కందులు గరిష్ఠంగా రూ.5,802 కనిష్ఠంగా రూ.5,800, పెద్ద హంస 186, ఆర్‌ఎన్‌ఆర్ 364, కందులు 55 క్వింటాళ్లు అమ్మకానికి వచ్చినట్లు మార్కెట్ అధికారి జయశ్రీ తెలిపారు.

ఇందిరాగాంధీ సేవలు చిరస్మరణీయం



మహబూబ్‌నగర్‌లో ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మహబూబ్‌నగర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజ్ అన్నారు. శుక్రవారం ఇందిరా గాంధీ వర్ధంతని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని క్లాక్ టవర్ చౌరస్తాలో విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, ఆనంద్ కుమార్‌గౌడ్, సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, వసంత, సిరాజ్‌ఖాద్రి, బెనహర్, అమరేందర్‌రాజు, సాయిబాబ, కంచిమిలక్ష్మణ్, రాములు యాదవ్, నాగరాజు, అబ్దుల్‌హక్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల: ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా కావేరమ్మపేటలోని ఇందిరాగాంధీ విగ్రహానికి మునిసిపల్ చైర్‌పర్సన్ పుష్పలత పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ రాజేందర్‌గౌడ్, నిత్యానందం, బుక్కవెంకటేశ్, అశోక్‌యాదవ్, మినాజ్, బుర్లవెంకటయ్య, చాగంటిరఘు, యాదయ్య, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

రాజాపూర్: మండలత కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో శేఖర్ గౌడ్, శ్రీనివాస్ నాయక్, యాదయ్య, లక్ష్మయ్య, రమేశ్, రమణ, బుగ్గయ్య, శివకుమార్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మిడ్జిల్: మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ జ్యోతి ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అల్వాల్‌రెడ్డి, గౌస్, సంపత్, వెంకటయ్య, మల్లికార్జున్‌రెడ్డి, జహీర్, ఉస్మాన్, పర్వతాలు, ఆదాం పాల్గొన్నారు.



జడ్చర్లలో ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీసీలు రాజ్యాధికారంలోకి రావాలి

- ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న

రాజాపూర్, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలు రాజ్యాధికారంలోకి రావాలని అప్పుడే బీసీల బతుకులు మారుతాయని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రం నుంచి మహబూబ్‌నగర్ వెళ్తున్న ఆయనకు మండల బీసీ సంఘాల నాయకులు పూలమాల, శాలువాలతో సన్మానించి, ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ విగ్రహానికి పూలమా వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో శ్రీశైలంయాదవ్, కృష్ణయ్య, అల్లె శ్రీనివాస్, లింగం, రాజశేఖర్, ఆంజనేయులు, శ్రీశైలం, లక్ష్మయ్య పాల్గొన్నారు.

కార్మికుల చెమట రూపమే ఏఐటీయూసీ



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణరెడ్డి

పాలమూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): సంఘటిత, అసంఘటిత కార్మికులు చిందించే చెమటకు ప్రతిరూపమే ఏఐటీయూసీ అని రాష్ట్ర కోశాధికారి సత్యనారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ 106వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పట్టణంలో ర్యాలీ, అనంతరం సభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దేశానికి సంపూర్ణ స్వాతంత్ర్యం కావాలని 1920లో ఏఐటీయూసీని లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ స్థాపించారన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో ఏఐటీయూసీ విప్లవ పంథాలో ఉద్యమించి బ్రిటీష్ వారిని తరిమికొట్టిందన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు కార్మికుల హక్కులకోసమే పోరాటం చేస్తోందన్నారు. కార్యక్రమంలో మధుసూదన్‌రెడ్డి, సురేశ్, కోటేశ్వరరెడ్డి, భాస్కర్, వెంకటేష్, గోపాల్, చెన్నయ్య, బుచ్చన్న, అంజి, సత్యమ్మ, అంజమ్మ, శైలజ, జంగమ్మ, సవిత, లక్ష్మి పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి



తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నవాబ్‌పేట, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాడెమోని నర్సింహులు డిమాండ్ చేశారు. శుక్రవారం మాజీ ఎంపీపీలు అనంతయ్య, శ్రీనివాస్‌తో కలిసి తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపి తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఆదుకోవడంలో పూర్తిగా విఫలమైందన్నారు. మండలంలో చాలా గ్రామాల్లో పంటనష్టం జరిగిందన్నారు. ప్రభుత్వం ఆదుకోకుంటే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రతాప్, అంజయ్య, నర్సింహులు, తాహేర్ తదితరులు పాల్గొన్నారు.

కుల దురహంకారాన్ని అణచివేయాలి



సాయిలన్న చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

పాలమూరు, అక్టోబరు 31 (ఆంధ్రజ్యోతి): నల్లమల్ల ముద్దుబిడ్డ సాయిలన్న మతోన్మాదుల చేతిలో దారుణ హత్యకు గురయ్యారని ప్రజాసంఘాల నాయకులు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎఫ్‌టీయూ కార్యాలయంలో సాయిలన్న 41వ వర్ధంతిని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అధ్యక్షతన నిర్వహించారు. డీటీఎఫ్ వామన్‌కుమార్, హనీఫ్ అహ్మద్, చైతన్య మహిళా సంఘం శ్రీదేవి, శ్రీనివాసులు, ఆర్. నరసింహులు, యూటీఎఫ్ వెంకటేశ్, విజయకుమార్, జలాల్‌పాషా, ఎన్.బాలకృష్ణ, నిజాముద్దీన్, రహీం ప్రసంగించారు. సాయిలన్న నల్లమల్ల ప్రాంతం నుంచి మహబూబ్‌నగర్ పట్టణానికి చదువుకోవటానికి వచ్చారన్నారు. అన్యాయంపై తిరుగుబాటు చేసిన సాయిలన్నను మతోన్మాద గుండాల చేతిలో హత్యకు గురికావటం విషాదకరమన్నారు. మతోన్మాదానికి, ఫాసిజానికి, కుల దురహంకారానికి విశాల ప్రజా ఉద్యమాన్ని నిర్మించడమే సాయిలన్నకు నిజమైన నివాళి అర్పించడమన్నారు.